

దళితుల అభ్యున్నతికి జగనన్న కృషి
రాష్ట్రంలో దళితుల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు.
- 10లో..



అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం
ప్రజల నుంచి వచ్చే అర్జీల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. స్పందనలో అర్జీలు స్వీకరించారు.
- 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
32/22.5

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

నేడు నగరంలో భారీ ర్యాలీ
ఒంగోలు: పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి బాలినేని చేసిన కృషిని దృష్టిలో ఉంచుకుని మంగళవారం నగరంలో వాసన్న అభిమానులు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సెయింట్ జేవియర్స్ స్కూలు కర్నూల్‌రోడ్డు ఫ్లైఓవర్ వద్ద నుంచి పవర్ ఆఫీసు, ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు, పాతమార్కెట్ సెంటర్, మస్తాన్‌దర్గా, ట్రంకురోడ్డులో నుంచి చర్చిసెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తారన్నారు. నియోజకవర్గంలోని పేద ప్రజానీకానికి 25 వేలమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు బాలినేని చూపిన కృషిని దృష్టిలో ఉంచుకుని ఆయన అభిమానులు ఈ కార్యక్రమం చేపడుతున్నారన్నారు. ర్యాలీలో వాసన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎన్నికల విధుల్లో నిబంధనలు పాటించాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల నిర్వహణ, ఇతర విధులకు సంబంధించి అధికారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ప్రకాశం భవనంలో ఎన్నికల నోడల్ అధికారులతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం రాబోయే మూడు నెలలు అధికారులు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. నోడల్ అధికారులకు సంబంధించి మండల స్థాయి అధికారుల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. ఎన్నికల నిబంధనలపై స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తుది ఓటర్ల జాబితా, సంబంధిత సీడీలను కలెక్టర్ దినేష్‌కుమార్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేశారు. ఓటరు జాబితా సవరణ కోసం చేపట్టిన చర్యలను, వచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను వారికి కలెక్టర్ వివరించారు. వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా, స్వరూప్, రాజశేఖర్, సత్యనారాయణ, రసూల్, రఘురామ్ తదితరులు ఉన్నారు.

వడియ రాజుల సేవా సంఘ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తన్నీరు ఆంజనేయులు

ఒంగోలు: స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద వడియ రాజుల సేవా సంఘ రాష్ట్ర కార్యాలయాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు శనివారం ప్రారంభించారు. వడియరాజులంతా ఐకమత్యంగా ఉండాలని, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ అయితే వడియరాజులను గుర్తించి రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి అండగా ఉండేందుకు ఏకతాటిపైకి రావాలన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు చల్లా నాగేశ్వరమ్మ, గౌరవాధ్యక్షులు చల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు తన్నీరు వీరసాయి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విధుల్లోకి వస్తున్నారు..
ఒంగోలు సిటీ: తల్లులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నుంచి పదే పదే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను విధుల్లోకి చేరమని విజ్ఞప్తులు, హెచ్చరికలు చేస్తోంది. ప్రభుత్వం సాధ్యమైనంత వరకు చేయాల్సింది చేస్తామని చెబుతున్నా కొన్ని రాజకీయ పార్టీలు తప్పుదోవ పట్టించి ఆందోళన చేయడంతో అది నచ్చని వాళ్లు దశలవారీగా వచ్చి విధుల్లో చేరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 13 ప్రాజెక్టుల పరిధిలో 2799 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 220 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 2551 మంది హెల్పర్స్ ఉన్నారు. ప్రస్తుతం 1713 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 81 మంది మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, 934 మంది అంగన్‌వాడీ హెల్పర్స్ విధుల్లోకి చేరారు.

భవిష్యత్ నిర్ణేత



మహిళ తిరుగులేని శక్తిగా అవతరిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలను నిర్ణయించే ధీశాలిగా నిలుస్తోంది. ఓటర్ల జాబితాలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో 5,890 మంది స్త్రీలు అధికంగా ఉన్నారు. ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి, గిద్దలూరు నియోజకవర్గాల్లో అభ్యర్థుల భవిష్యత్ వీరి చేతుల్లో ఉంది.

- మహిళలు 9,02,749, పురుషులు 8,96,859
- అత్యధికంగా గిద్దలూరు నియోజకవర్గంలో 2,37,079 మంది
- అత్యల్పంగా యర్రగొండపాలెంలో 2,05,300 మంది
- జిల్లా కేంద్రం ఒంగోలులో 2,36,292 మంది ఓటర్లు
- 18–19 ఏళ్ల వయసు ఉన్న వారు 36,996
- పోలింగ్ కేంద్రాలు 2,183
- తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్ దినేష్‌కుమార్

జిల్లాలో ఓటర్లు 17,99,706

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల తుది జాబితా విడుదలైంది. జిల్లాలో 17,99,706 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 8,96,859 మంది, మహిళలు 9,02,749 మహిళా ఓటర్లు ఉన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ ఓటర్ల జాబితా విడుదల చేశారు. తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఒకే ఇంటి నంబర్, ఇంటి నంబర్ లేనివి, ఓటరు గుర్తింపు కార్డులో ఫొటోలు సరిగా లేనివి, మరణించిన వారి ఓట్లు తదితర అంశాలపై ఇంటింటి సర్వే పూర్తి చేశారు. ఈ ప్రక్రియ అంతా పారదర్శకంగా నిర్వహించిన అనంతరం జనవరి 22వ తేదీ తుది జాబితాను విడుదల చేశారు. వారంలో రెండుసార్లు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్టోరల్‌పై సమావేశాలు నిర్వహిస్తూ పార్టీలకు చెందిన ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిజమైన ఫిర్యాదులను పరిష్కరించారు. ఒకే ఇంటి నంబర్‌పై ఉన్న ఓట్లు, ఇంటి నంబర్‌లేని ఓట్లు, 100 ఏళ్ల వయసు పై బడిన ఓట్లు, ఫొటోలు సరిగాలేని ఓట్లు, మరణించిన వారి ఓట్లు వంటి వాటిపై అధికారులు క్షేత్ర స్థాయిలో కసరత్తు చేశారు. సోమవారం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి మహిళా ఓరటర్లు 9.02,749 మంది ఉన్నారు. పురుష ఓటర్లు 8,96,859 మంది ఉన్నారు. అన్నీ నియోజకవర్గాల్లో అత్యధికంగా గిద్దలూరు నియోజకవర్గంలో 2,37,079 మంది ఓటర్లు ఉండగా, అత్యల్పంగా యర్రగొండపాలెం నియోజకవర్గంలో 2,05,300 మంది ఉన్నారు. జిల్లా కేంద్రం ఒంగోలు నియోజకవర్గంలో 2,36,292 మంది ఓటర్లు నమోదయ్యారు. 18–19 ఏళ్ల వయసు ఉన్న యువత ఓట్లు 36,996, సర్వీసు ఓటర్లు 6815 మంది ఉన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

గత ఏడాది జనవరి 5వ తేదీన ఓటర్ల జాబితా విడుదలైంది. జిల్లా వ్యాప్తంగా 17,86,603 మంది ఓటర్లు ఉండగా అందులో 8,91,799 మంది పురుషులు, 8, 94,684 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 120 మంది ఉన్నారు. గత ఏడాది అక్టోబర్ 27వ తేదీ విడుదలైన ముసాయిదా జాబితా ప్రకారం 17,80,145 మంది ఓటర్లు ఉన్నట్టుగా అధికారులు తేల్చారు. అందులో పురుషులు 8,87,344 మంది, 8,92,693 మంది మహిళలు, ఇతరులు 108 మంది ఉన్నారు. ఈ జాబితా ప్రకారం 5,349 మంది మహిళలు అధికంగా ఉన్నారు. అనంతరం నవంబర్ 4,5, డిసెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ నెల 5వ తేదీ వరకూ కొత్త ఓటర్ల చేర్పులు, తొలగింపు, సవరణలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులను సైతం అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించారు. అనంతరం పూర్తి పారదర్శకంగా అధికారులు తుది జాబితాను సోమవారం ప్రకటించారు. దీనిప్రకారం ముసాయిదా జాబితా కంటే అదనంగా 19463 మంది ఓటర్లు ఉన్నారు.

2183 పోలింగ్ కేంద్రాలు..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో 265, దర్శి 282, సంతనూతలపాడు 256, ఒంగోలు 259, కొండపి 283, మార్కాపురం 257, గిద్దలూరు 284, కనిగిరి 297 పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తం 2183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇదిలా ఉండగా యర్రగొండపాలెంలో 1, ఒంగోలులో 3, కనిగిరిలో1 పోలింగ్ కేంద్రంతో కలిపి మొత్తం 5 పోలింగ్ కేంద్రాలు కొత్తగా ఏర్పాటు చేశారు.

నియోజక వర్గాల వారీగా వివరాలు ఇలా..

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
యర్రగొండపాలెం	1,04,222	1,01,077	1	205300
దర్శి	112868	110807	10	223685
సంతనూతలపాడు	1,04,408	107944	5	212357
ఒంగోలు	113702	122549	41	236292
కొండపి	116747	119117	2	235866
మార్కాపురం	106777	105288	5	212070
గిద్దలూరు	118229	118831	19	237079
కనిగిరి	119906	117136	15	237057
మొత్తం	8,96,859	9,02,749	98	17,99,706

పారదర్శకంగా ఓటర్ల జాబితా
- నామినేషన్ల చివరి రోజు వరకు కొత్త ఓట్ల నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు
- మార్పులు, చేర్పులు, తొలగింపు ఓట్ల కోసం ఎన్నికల నోటిఫికేషన్ పది రోజుల ముందు వరకు
- విలేకర్ల సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్



తుది ఓటరు జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాకు సంబంధించి తుది ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించి విడుదల చేస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రకాశం భవనంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి జిల్లాకు సంబంధించిన తుది ఓటరు జాబితాను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తుది ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 17,99,706 మంది ఓటర్లు ఉన్నారన్నారు. గత ఏడాది అక్టోబర్ 27వ తేదీ విడుదల చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో మొత్తం 17,80,145 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఫారం6, 6ఏ, 8ల ద్వారా మొత్తం యాడ్ చేసిన ఓట్లు 91,966 పరిష్కరించామన్నారు. అదేవిధంగా మరణించిన వారి ఓట్లు, శాశ్వతంగా షిఫ్ట్ అయిన ఓట్లుకు సంబంధించి 72,345 తొలగించామన్నారు. గత ఏడాది జవవరిలో విడుదల చేసిన తుది ఓటరు జాబితా తర్వాత నుంచి అందిన ఫారం 6,7,8లకు సంబంధించి మొత్తం 5,53,345 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 5,02,308 పరిష్కరించామని తెలిపారు. మిగిలిన వాటిలో 19,562 దరఖాస్తులు తిరస్కరించగా 1425 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధన ప్రకారం నామినేషన్ల చివరి రోజు వరకు కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారికి ఫారం–6 ద్వారా అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఫారం 7,8 ద్వారా మార్పులు చేర్పుల కోసం నోటిఫికేషన్ విడుదలకు పది రోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఈ షెడ్యూలు ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. ఓటు హక్కుకు సంబంధించిన ఏ వివరాల కోసమైనా టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1950 తో పాటు, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. ఓటర్లకు సంబంధించిన ఎపిక్ కార్డులను త్వరగా పంపిణీ చేస్తామన్నారు. విలేకర్ల సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలు పాలడెయిరీ ఎదుట పెద్ద తెర మీద అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపనను ప్రత్యక్ష ప్రసారంలో తిలకిస్తున్న భక్తులు



కనుడు..కనుడు కమనీయం
అయోధ్య రామయ్య విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రామభక్తులు సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సీతారామ కల్యాణాలు, శోభాయాత్రలు నిర్వహించారు. పలుచోట్ల సామూహికంగా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. - సాక్షి నెట్‌వర్క్

పేదల ఆత్మబంధువు సీఎం జగన్



నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సురేష్, సర్పంచ్ శ్రీదేవి



మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- మాలపాడులో రూ.1.15 కోట్లతో నిర్మించిన కార్యాలయాలు ప్రారంభం

పొన్నలూరు: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజలతో పాటు అన్ని వర్గాల్లోని పేద ప్రజల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆత్మ బంధువుగా నిలిచారని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని మాలపాడు పంచాయతీలో సోమవారం మంత్రి సురేష్ పర్యటించి రూ.1.15 కోట్లతో నిర్మించిన నూతన సచివాలయం, ఆరోగ్య కేంద్రం, జగనన్న పాలవెల్లువ భవనాన్ని, మూలేవారిపల్లెలో జలజీవన్ మిషన్ ద్వారా నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా ప్రభుత్వ భవనాలను క్షేత్ర స్థాయిలో నిర్మించి సచివాలయ వ్యవస్థ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను, వలంటీర్లను ఇంటి వద్దకే పంపించి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసి పేదల ముఖంలో సంతోషాన్ని చూస్తున్నారన్నారు. జగనన్న కులం.. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, జగనన్న మతం.. చెప్పిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చడమే అన్నారు.

దమ్ముంటే ఎస్సీ, ఎస్టీ పథకాలపై చర్చకు సిద్ధమా....

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ పథకాలను నిలిపివేసిందని అసత్య ప్రచారం చేస్తున్న చంద్రబాబు, పచ్చ బ్యాచ్ దమ్ముంటే ఎస్సీ, ఎస్టీ పథకాలు, వారి అభివృద్ధిపై చర్చకు రావాలని మంత్రి సురేష్ సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో గ్రామాల్లో పెత్తందారి వ్యవస్థను తీసుకొచ్చి ఎస్సీ, ఎస్టీలతో పాటు అన్ని వర్గాల్లోని పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలు రానివ్వకుండా నిలువునా మోసం చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఎస్సీ, ఎస్టీ వంటి పేద వర్గాల ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందారని చెప్పారు.

దళితుల ఆత్మగౌరవ ప్రతీక జగనన్న...

రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా విజయవాడ సెంటర్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని స్థాపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని మంత్రి సురేష్ కొనియాడారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు మాటలకే పరిమితం చేసి దళితులను మోసం చేస్తే, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిందే తడువుగా అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి దళిత ప్రజల ప్రేమానురాగాలను చూరగొన్నారన్నారు. అన్ని రకాల పదవుల్లో దళితులకు సముచిత స్థానం ఇచ్చి వారిని ఉన్నత పదవుల్లో నిలిపారన్నారు. దళిత ప్రజలు, దళిత ప్రజా ప్రతినిధులు అంటే చంద్రబాబుకు ఇష్టం ఉండదని, అందుకే నియోజకవర్గాలు మారిన దళిత ప్రజా ప్రతినిధులను చెత్తతో పోల్చుతూ హేళనగా మాట్లాడుతున్నారన్నారు. గతంలో టీడీపీలోని దళిత ఎమ్మెల్యేలను మరొక నియోజకవర్గానికి మార్చిన సంగతి చంద్రబాబు మర్చిపోయారన్నారు. చంద్రబాబు, పచ్చ బ్యాచ్ మాటలు గురివింద సామెత లాగా ఉందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలోని బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా వాడుకుంటే, నేడు సీఎం జగన్ బీసీలకు అత్యున్నత పదవులు ఇచ్చి బీసీలు అంటే బ్యాక్ బోన్ క్యాస్ట్‌గా అభివర్ణించాడని పేర్కొన్నారు.

అందరిదీ జగనన్న గ్రూపే..

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కోరిక మేరకు కొండపి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాడనికి వచ్చానని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. కొండపి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీలో ఎలాంటి గ్రూపులు లేవని, పచ్చబ్యాచ్‌తో పాటు టీడీపీ అనుకూల మీడియా వైఎస్సార్‌సీపీలో గ్రూపులు ఉన్నట్లుగా సృష్టిస్తూ అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. అందరిదీ జగనన్న గ్రూపు మాత్రమే అని వచ్చే ఎన్నికల్లో అందరిని కలుపుకొని పోయి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్న నమ్మకాన్ని నిలబెడతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ సిరిగిరి శ్రీదేవి, ఎంపీటీసీలు వరికూటి సుబ్బులు, పిన్నిక యానాది, వైస్ సర్పంచ్ సిరిగిరి బాలిరెడ్డి, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంపీడీఓ కల్పన, సిరిగిరి గోపాల్‌రెడ్డి, వరికూటి ఆంజనేయులు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కనపర్తి గోవిందమ్మ, మాజీ సర్పంచ్ కుర్రా శ్రీను, పలువురు, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

వాసన్నతో దామచర్లకు పోలికా...

- పేదల కోసం పరితపించే నేత బాలినేని
- పేదల ఇళ్ల పట్టాలకు అడ్డుపడేది దామచర్ల
- జీఓ ఇస్తేనే ర్యాలీలా అంటూ పచ్చ పత్రికల రోత రాతలు
- పుట్టిన రోజున ఎవరైనా జిల్లాలోని అందరినీ పిలిపించుకొని ర్యాలీ చేసుకుంటారా?
- రాష్ట్ర పొగాకు, వ్యవసాయ ఉత్పత్తుల సహకార సమాఖ్య చైర్మన్ వాకా బసివిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వాకా బసివి రెడ్డి, ఇతర నాయకులు

ఒంగోలు సబర్బన్: పేదల కోసం నిరంతరం పాటుపడే మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డితో టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు పోలికా అంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు స్థానిక భాగ్యనగర్ రెండో లైన్‌లోని రాష్ట్ర పొగాకు అండ్ వ్యవసాయ ఉత్పత్తుల సహకార సమాఖ్య కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పచ్చ మీడియా, ప్రతిపక్ష టీడీపీ నాయకుల తీరును తూర్పారబట్టారు. రాష్ట్ర పొగాకు అండ్ వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకారం సమాఖ్య చైర్మన్ వాకా బసివి రెడ్డి, ఒంగోలు నగర పాలక సంస్థ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య, చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాస రావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పచ్చ పత్రికలు, పచ్చ మీడియా, టీడీపీ నాయకుల తీరుపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి పత్రిక అడ్డగోలు రాతలు రాస్తోందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ వింత పోకడ, జీఓ ఇస్తేనే ర్యాలీలా అంటూ రోత రాతలు రాయటం నీచానికి దిగజారటమే విమర్శించారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు యరజర్ల వద్ద 25 వేల మందికి 808 ఎకరాలు చదును చేయించి లే అవుట్ తయారు చేయించి ఇళ్ల పట్టాలు ఇవ్వటానికి బాలినేని పూనుకుంటే హైకోర్టుకు వెళ్లి పేదల ఇళ్ల పట్టాలు ఆపిన ఘనుడు దామచర్ల జనార్దన్ కాదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పట్టుబట్టి మరీ రూ.210 కోట్లు మంజూరు చేయించి 508 ఎకరాలు రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయిస్తుంటే జీఓ మాత్రమే ఇచ్చారని తప్పుడు వార్తలు రాయించటం జనార్దన్‌కే చెల్లిందని ధ్వజమెత్తారు. మంచినీటి పథకానికి రూ.350 కోట్లు మంజూరు చేయించి టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకొని రివర్స్ టెండర్ దశ కూడా పూర్తి చేసుకొని అగ్రిమెంట్ దశలో ఉన్న పథకాన్ని కూడా జీఓ మాత్రమే ఇచ్చారని రాయటం, అందుకు దామచర్ల వంత పాడటం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. ఒంగోలు నగరంలో ప్రతి డివిజన్‌లో రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం కోసం దాదాపు రూ.100 కోట్లకు పైగా వెచ్చించారన్నారు. యువనేత బాలినేని ప్రణీత్ రెడ్డికి యువకుల కోటాలో జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఏదోఒక నియోజకవర్గంలో టికెట్ కేటాయించాలని సీఎం వైఎస్ జగన్‌కు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఒంగోలుకు వస్తున్న ప్రియతమ నేత ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డికి ఘనంగా స్వాగతం పలుకుతూ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అభివృద్ధి పనులు చేసి అందుకు తార్కాణంగా ర్యాలీలు నిర్వహించుకుంటారు ఎవరైనా... కానీ ఎవరూ చేయని విధంగా జిల్లా నలుమూలల నుంచి పార్టీ కేడర్‌ను, జనాలను పలిపించుకొని పుట్టిన రోజున ర్యాలీలు నిర్వహించుకుంటారా అని దామచర్లను ప్రశ్నించారు. కార్యక్రమంలో చీమకుర్తి మండలం గుడిపూడి వారి పాలెం సొసైటీ అధ్యక్షుడు కడియాల మల్లిఖార్జున రావు పాల్గొన్నారు.

ఇద్దరు దివ్యాంగులకు ఉద్యోగాలు
- నియామక పత్రాలు అందించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: ఇద్దరు దివ్యాంగులను జూనియర్ అసిస్టెంట్స్‌గా నియమిస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సోమవారం నియామక పత్రాలు అందించారు. 2020–21 సంవత్సరంలో కోటాలో అర్హులైన ఒక బధిర, మరొక అంధులైన వారిని ఎంపిక చేశారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని, వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

క్లుప్తంగా

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.31 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): ప్రసిద్ధిగాంచిన మిట్టపాలెం నారాయణస్వామివారి ఆలయానికి ఆదివారం రూ.1,31,370 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ జి.రమణారెడ్డి సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల విక్రయంతో రూ.70,260, లడ్డూ ప్రసాదాల విక్రయంతో రూ.22,830, శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రు.38,280 ఆదాయం వచ్చినట్లు ఈఓ, చైర్మన్ వివరించారు.

యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ల సర్టిఫికెట్లు పరిశీలన

- 25వ తేదీనాటికి నియామక పత్రాలు
- జిల్లా పశుసంవర్ధ జేడీ బేబీరాణి వెల్లడి

ఒంగోలు సెంట్రల్: గ్రామ/వార్డు సచివాలయ యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టులకు నిర్వహించిన రాత పరీక్షల్లో అర్హత పొందిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం జిల్లా పశుసంవర్ధశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 177 యానిమల్ హస్బెండరీ పోస్టులకు పరీక్ష నిర్వహించగా 2500 మంది హాజరయ్యారని, అందులో మెరిట్, రోస్టర్ ప్రకారం 109 మంది అభ్యర్థులు అర్హత సాధించారని చెప్పారు. అందులో 37 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించామని తెలిపారు. మరో 72 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు మంగళవారం పరిశీలిస్తామన్నారు. ఎంపిక కమిటీ చైర్మన్ అయిన జిల్లా కలెక్టర్ ఆమోదంతో ఈనెల 25వ తేదీన నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు.

ఆబాలగోపాలం రామమయం


కంభంలో శోభాయాత్ర..

అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం జిల్లా వ్యాప్తంగా శోభాయాత్రలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో ఊరూవాడా హోరెత్తాయి. సీతారాముల కళ్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించారు. భక్తులు అయోధ్య అక్షతలను తలపై చల్లుకుని తరించారు. శోభాయాత్రల్లో మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

– సాక్షి నెట్‌వర్క్


ఒంగోలులోని గాంధీ రోడ్డులో సీతారాముల కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పొదిలి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


పామూరులో జై శ్రీరామ్ నినాదాలు చేస్తున్న యువత


ఒంగోలు గాంధీ రోడ్డులో కళ్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు


బేస్తవారిపేట శోభాయాత్రలో చిన్నారుల కోలాటం


గొట్లగట్టులో కోలాట ప్రదర్శన


ఒంగోలు పాల డెయిరీ ఎదుట అయోధ్య సంబరాలు..

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకటేశ్వరరావు

జరుగుమల్లి: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తూ షాక్ గురై తీవ్రంగా గాయపడిన లైన్‌మన్ గుంటూరులోని ఉదయ్ ఆస్పత్రి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. జరుగుమల్లి ఎస్సై వెంకటేశ్వరరావు కథనం మేరకు.. గిద్దలూరు మండలం సంజీవరాయునిపేట గ్రామానికి చెందిన బొగ్గుల రామయ్య(44) జరుగుమల్లి మండలం వర్ధినేనివారిపాలెం గ్రామంలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీన పీరాపురం గ్రామ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను బాగు చేసేందుకు విద్యుత్ స్తంభం ఎక్కారు. అయితే ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభం పైనుంచి కింద పడిపోయారు. రామయ్యకు నడుము భాగంలో అంతర్గతంగా తీవ్ర గాయమైంది. గుంటూరులోని ఉదయ్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ రామయ్య సోమవారం ఉదయం 6 గంటలకు మృతి చెందారు. మృతునికి భార్య కుమారుడు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై వి.వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంట సమీపంలో పాలేరు నది రైల్వే బ్రిడ్జి వద్ద ఓ గుర్తు తెలియని యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ప్రమాదం సంభవించినట్లు రైల్వే సీఐ శ్రీకాంత్‌బాబు తెలిపారు. మృతుడి శరీరంపై నలుపు రంగు జీన్స్ ఫ్యాంట్, నలుపు రంగు డ్రాయర్ ఉన్నాయని, చామన ఛాయ రంగులో ఉన్నాడని వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఒంగోలు జీఆర్‌పీ ఎస్సై కొండయ్య తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440904870, 9440627646, 0440887143ను సంప్రదించాలని సూచించారు.

దళితుల అభ్యున్నతికి జగనన్న కృషి

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్
- పొన్నలూరులో 108 మంది దళిత రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ


దళిత మహిళా రైతుకు భూహక్కు పట్టా అందజేస్తున్న మంత్రి సురేష్

పొన్నలూరు: రాష్ట్రంలోని దళితుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 108 మంది దళిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సంపూర్ణ భూహక్కు పట్టాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ.. గతంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో భూమి కొనుగోలు పథకం ద్వారా భూములు పొందిన దళితులకు జగనన్న దళిత సంపూర్ణ భూహక్కు పథకం ద్వారా శాశ్వత భూహక్కు పట్టాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కొన్నేళ్లుగా అసైన్డ్ భూములు పొందిన దళిత రైతులు భూహక్కు పట్టాలు లేకపోవడం వల్ల క్రయవిక్రయాలకు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. వీరి కష్టాలను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో అసైన్డ్ భూములను పరిశీలించి అర్హత కలిగిన ప్రతి దళిత రైతుకు పట్టాలు అందజేయాలని ఆదేశాలిచ్చారని వివరించారు. 20 ఏళ్లకు పైగా అసైన్డ్ భూములు అనుభవిస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం పట్టాలు అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సిరిగిరి గోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కొండారెడ్డి కాలనీలో ఆదివారం అర్ధరాత్రి ఇల్లు దగ్ధమై సుమారు 2 లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు. ఆదివారం రాత్రి పొద్దుపోయిన తరువాత కాలనీలో నివాసం ఉంటున్న అరబోలు సుబ్బయ్య ఇంట్లో విద్యుత్ షార్టు సర్క్యూట్ అయి మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న సుమారు రూ.75 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు, దుస్తులు, నిత్యవసర వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు సుబ్బయ్య తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది హుటాహుటిన వెళ్లి చుట్టుపక్కల నివాసాలకు మంటలు వ్యాపించకుండా అదుపుచేశారు.

అంగన్‌వాడీల ఆందోళనలో అసాంఘిక శక్తులకు చెక్

- శాంతి భద్రతలకు విఘాతం కలిగించే కుట్రలను తిప్పికొట్టిన పోలీసులు
- ఎస్పీ మలికా గర్గ్ నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు


ఒంగోలులో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సబర్బన్: అంగన్‌వాడీల ముసుగులో కొన్ని రాజకీయ పార్టీలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడనున్నారన్న సమాచారం మేరకు జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఎస్పీ మలికాగర్గ్ స్వయంగా రంగంలోకి దిగారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనలో భాగంగా చలో విజయవాడ, తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే అంగన్‌వాడీల ఆందోళనను అడ్డుపెట్టి శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్రలు పన్నినట్లు సమాచారం అందటంతో ఎక్కడి వారిని అక్కడే కట్టడి చేశారు. ఆదివారం రాత్రి నుంచి ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు అన్ని రకాల రహదారుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆందోళనలో అసాంఘిక శక్తులు ప్రవేశిస్తే అంగన్‌వాడీలకు ఎక్కడ ఇబ్బంది ఏర్పడుతుందోనన్న ముందస్తు చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఎస్పీ వెంట అడ్మిన్ ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


ఒంగోలు రైల్వే స్టేషన్‌లో సూచనలిస్తున్న ఎస్పీ

అర్జీల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సబర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 88 ఫిర్యాదులు వచ్చాయి. బాధితులతో నేరుగా మాట్లాడి, అర్జీలు స్వీకరించిన ఎస్పీ వాటి పరిష్కారానికి పూనుకున్నారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. కుటుంబ కలహాలు, భార్యాభర్తల, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలతోపాటు ఇతర సమస్యల గురించి ప్రజలు వినతులు సమర్పించారు. ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్స్) శ్రీధరరావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, దిశ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
బి.పాపారావు	త్రిపురాంతం సర్కిల్	గూడూరు ఒన్‌టౌన్ పీఎస్, తిరుపతి జిల్లా
షేక్.సమిఉల్లాహ్	మాచర్ల రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా	దర్శి సర్కిల్, ప్రకాశం జిల్లా
జె.రామకోటయ్య	దర్శి సర్కిల్, ప్రకాశం జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు
కె.అజయ్‌కుమార్	ఎస్సీ ఎస్టీ సెల్, ప్రకాశం జిల్లా	దిశ-2, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా
టి.విజయకృష్ణ	రేంజ్ వీఆర్, గుంటూరు	సీసీఎస్, ప్రకాశం జిల్లా
పి.బాలాజీ	సీసీఎస్, ప్రకాశం జిల్లా	రేంజ్ వీఆర్, గుంటూరు

మెడికల్ కాలేజీ, వైద్యశాలకు ఏడీల నియామకం

మార్కాపురం: మార్కాపురంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీ, జిల్లా వైద్యశాలకు అసిస్టెంట్ డైరెక్టర్లను నియమించినట్లు కాలేజీ సూపరింటెండెంట్ రాజశేఖర్ సోమవారం తెలిపారు. మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వెంకమరాజును, జిల్లా వైద్యశాల ఏడీగా రాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.